# సిరిసంపదలు

## శ్రీసాయి పల్లవి

అప్పటికి అరగంట నుంచి భార్యకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నాడు సిద్ధార్థ. ఆమె అతని మాటల్ని వినిపించుకోలేదు సరికదా–

''మీదంతా మిడిల్ క్లాస్ మెంటాలిటీ'' అంటూ కొట్టిపారేసింది.

సహనం నశించి అతను మాట్లాడటం మానేశాడు. ఆమె కోరినట్లు వందరూపాయల నోట్లు బీరువాలోనుంచి తీసి ఆమె చేతిలో ఉంచాడు.

పరిమళ విసవిసా నడుచుకుంటూ వెళ్లిపోయింది. భర్తను ఎదిరించి, అనుకున్నది సాధించుకున్నానన్న అహం ఆమె నడకలో స్పష్టంగా కనిపిస్తోంది. వాదనలో ఎదుటివ్యక్తితో తలపడి గెలిస్తే సహజంగా వచ్చే సంతోషం కాదది. తన పంతం నెగ్గిందన్న తృప్తి... ఈగో సాటిస్ఫేక్షన్.

చాలామంది మధ్యతరగతివాళ్ల మాదిరిగానే– పరిమళకు కూడా లేనిది ఉన్నట్లు చూపించుకోవాలన్న తాపత్రయం ఎక్కువ. తను మిగతావాళ్ల కంటె దేనిలోనూ తీసిపోనని ప్రతి విషయంలోనూ చాటుకునే ప్రయత్నం చేస్తుంది.

అదిగో– భర్తతో గొడవ పడిన సందర్భమూ అదే.

ఆరోజు ఎస్.ఇ.గారి భార్య పేరంటానికి రమ్మని కబురు పంపింది. కాలనీలో ఉండే అందరితోనూ పరిమళకు స్నేహం ఎక్కువ. అందులోనూ సొంతకారు, రెండంతస్థుల మేడ, నౌకర్లు, ఇంటికి వచ్చేవాళ్లు, పోయేవాళ్లతో నిత్యం సందడిగా ఉండే ఎస్.ఇ.గారి భార్యతో మరీను. ఆవిడ కట్టిన చీర కట్టదు. నగలు– ఏ కొత్త మోడల్ మార్కెట్లోకొచ్చినా ఆమె ఒంటి మీద ప్రత్యక్షం కావలసిందే. అడుగుదీసి అడుగెయ్యాలన్నా పక్కన ఒకర్లో ఇద్దరో పనిమనుషులు ఉంటారు. ఆమె మామూలు వాళ్లతో స్నేహం చెయ్యదు. కలెక్టర్‌గారి భార్య, యస్పీగారి భార్య, అప్పుడప్పుడు ఆ వూరి ఎమ్మెల్యేగారి భార్య (భార్య కాదంటారు కొందరు– నిజానిజాలు దేముడెరుగు) ఆమెను కలుస్తుంటారు. ఆదివారం వచ్చిందంటే చాలు– సాయంత్రం రెండు మూడు గంటలపాటు అంతా ఒకచోట చేరతారు. కబుర్లు చెప్పుకుంటారు. కాసేపు పేకాట ఆడతారు. మరి కొంచెంసేపు టి.వి. ముందు కాలక్షేపం చేస్తారు. అతిథులు వచ్చి వెళ్లే వరకూ అడపాదడపా టిఫిన్లు వస్తాయి. అవి గొంతులోనుంచి తేలిగ్గా కడుపులోకి జారటానికి చల్లటి ద్రవ పదార్థం కూడా అందుబాటులో ఉంటుంది.

కారులో తప్ప బయటకు కదలని ఎస్.ఇ.గారి భార్యకి– కలెక్టరాఫీసులో దుమ్ముపట్టిన ఫైళ్ల మధ్య నిత్యం కాలక్షేపం చేసే సీనియర్ క్లర్క్ సిద్ధార్థ భార్య పరిమళకు స్నేహం కుదిరిందంటే ఏదో వింతగానే చెప్పుకోవాలి. అయితే జత కుదిరింది. మామూలుగా కాదు, గాఢంగా. అదెలాగంటె–

• • •

ఆరోజు అనుకోకుండా కారు చెడిపోయి సరిగ్గా పరిమళ ఇంటి ముందే ఆగింది. డ్రైవరు కిందకు దిగి– ఏదోరకంగా బయలుదేరకపోతుందా అన్న ఆలోచన చేస్తున్నాడు. అదే సమయంలో ముగ్గు వేయటానికి బయటకొచ్చిన పరిమళకి–

కార్లో తళ తళ మెరుస్తున్న ఎస్.ఇ.గారి భార్య కంటపడి విభ్రాంతికి లోనయ్యింది.

ఒళ్లంతా కళ్లు చేసుకుని– ''మీరా?!'' అంది. ఎక్కువసేపు కూర్చోవటంవల్ల కాళ్లు తిమ్మెరెక్కి అప్పటికే విసిగిపోయి ఉన్న ఎస్.ఇ.గారి భార్యకి ఒకింత ఊరట కలిగింది. తనను ఒక వ్యక్తి గుర్తించిందన్న ఆనందంతో సంబరమేసింది. పలకరింపుగా నవ్వుతూ కారు దిగింది.

మీరు నాకు తెలుసు. ఫలానా కదూ?! అనేసరికి ఆమె రోమాలు నిక్కపొడుచుకున్నాయి.

'ఈ కాలనీలో తన ఉనికిని చాలామంది గుర్తిస్తున్నారన్న మాట.'

ఒకసారి గాగుల్స్ సర్దుకుంటూ– ''మీరు..?'' అంటూ అర్థోక్తితో ఆగిపోయింది.

పరిమళకి ఏం చెప్పాలో తోచలేదు. సిద్ధార్థ అనబడే సీనియర్ క్లర్క్‌కి భార్య అని చెప్పుకోవటం చిన్నతనమనిపించింది. తన పేరు వరకూ చెప్పి– ''మీ చీర చాలా బావుందండీ!'' అంటూ మాట మార్చింది.

ఎస్.ఇ.గారి భార్యకు కావలసింది అదే. తనను నలుగురూ గుర్తించాలి. తన గొప్పదనాన్ని ప్రశంసించాలి. చీరకట్టులోగానీ, మేకప్ అద్దుకోవటంలోగానీ ప్రత్యేకత చూపుతుంది తను. అది అందరూ మెచ్చుకున్నప్పుడే కదా.. వాటికి నిజమైన సార్థకత అనుకుంటుంది. అందుకే పరిమళ చీర ప్రస్తావన తేగానే– పొంగిపోయి గబగబా చెప్పటం ప్రారంభించింది.

మంత్రిగారి భార్య, తనూ పార్టీలో పోటీపడి ఎవరెక్కువ మంచి చీరలు కడతారో తేల్చుకోవాలనుకోవటం– ఓ రోడ్డు కాంట్రాక్టులో భర్తకొచ్చిన లంచం– ఇలా చీరలా రూపాంతరం చెందటం– టౌన్‌లో అలాంటి చీర మరెవ్వరికీ లేదని షాపువాడు చెప్పటం వరకూ.. అన్నీ పూసగుచ్చినట్టు వివరించింది.


చెవులు రిక్కించుకొని మరీ విన్నది పరిమళ. సినిమాల్లో తప్ప నిజజీవితంలో ఇలాంటి వ్యక్తులను ఆమె చూసి ఎరుగదు.

అప్పటివరకూ ఓ 'గొప్ప వ్యక్తి'ని రోడ్డుమీదే నుంచోబెట్టి మాట్లాడుతున్నానన్న విషయం స్ఫురించి లోపలికి ఆహ్వానించింది.

ఎస్.ఇ.గారి భార్య అవుననలేదు. కాదనలేదు. తలపంకిస్తూ– డ్రైవర్ వంక చూసింది. 'ఈ మహాతల్లి తన ఉద్యోగం ఉంచుతుందో, ఊడ్చుతుందో– కారు అర్థాంతరంగా మొండికేసింది'– భయంతో బిగుసుకు పోయాడతను. వెంటనే కుదిరే అవకాశం లేదని కూడా ఒక్కోపదం కూడబలుక్కుంటూ చెప్పేశాడు. 'నీ చావు నువ్వు చావు. నేను ఇంటికెళతా..' ఆమాట నేరుగా అనలేదుగానీ– ఆమె కదలిన తీరు చూసి డ్రైవరు అదే అభిప్రాయానికొచ్చాడు.

ఒక అడుగు ముందుకు వేసినదల్లా– ఎస్.ఇ.గారి భార్య వెనక్కి తిరిగి–

''మీరేం అనుకోబోతే కొంచెం మా యింటి



దాకా తోడు వస్తారా'' - అనేసరికి పరిమళ ఆనం దానికి హద్దుల్లేకుండా పోయాయి. అనుకోని అదృష్టంగా భావించి ఆమెను అనుసరించింది.

ఐదు నిముషాల నడక-

ఎస్.ఇ.గారి ఇంట్లో అడుగు పెట్టేసరికి ఆమె కళ్లు తిరిగిపోయాయి.

నేలమీద పాదం మోపితే మాసిపోతుందా అన్నం తగా- తెల్లగా ధగా ధగా మెరుస్తున్న పాలరాయి. విశాలమైన గది మధ్యలో ఉయ్యాల- దానికి ఎదురుగా దాదాపు పాతిక మంది కూర్చోటానికి అనువుగా ఫర్నిచర్. ఓవైపున డైనింగ్ టేబుల్- గోడలపైన అందమైన చిత్రాలు.

ఎటు చూడాలో తెలియటంలేదు. ఓ కొత్తలో కంలోకి ప్రవేశించిన అనుభూతి కలిగింది ఆమెకి. శరీరం- తెలియకుండానే వణికింది. అది భయం కాదు- బెరుకు.

‘‘అరె! నిలుచునే ఉన్నారా? కూర్చోండి'' లోపల నుంచి వచ్చిన ఎస్.ఇ.గారి భార్య మామూ లుగా చెప్పినా- ఆమె ఆజ్ఞాపించినట్టే అనిపిం చింది పరిమళకు. సోఫాపైనా.. అదీ కాస్త చివ రగా.. కూర్చునీ, కూర్చోనట్టుగా.. కాస్త ఇబ్బం దిగానే కూర్చుంది.

అంతలో ఆమెకి డ్రింక్ సర్వ్ చేశారు పనిమనుషులు. ఒకామె గాజుగ్లాసు చేతిలో పెడితే- ఇంకోఆమె మూతి తుడుచుకోటానికి క్లాత్ అందించింది.

‘‘అబ్బే! వద్దండీ''

అనబోయి- తను తాగుతున్న పదార్థం- రుచిగా- కొత్తగా ఉండటంతో- కాదనలేక-

అలాగని మరీ వేగంగా తాగితే- లేకిగా అనుకుంటారేమోనన్న ఆలోచన మనసులో మెది లేసరికి- భయంవేసి- గ్లాసులో అడుగున పావు వంతు మిగిల్చి- చివరికి ఎలాగైతేనేం డ్రింక్ తాగటం పూర్తి చేసింది పరిమళ.

అంతలోనే- ‘‘ఇల్లు చూద్దురుగానీ రండి'' అంటూ- మళ్లీ ఎస్.ఇ.గారి భార్య పిలిచేసరికి- ఆమెకు ‘జీ హుజూర్' అనక తప్పలేదు.

ఇది మా గది.. డైనింగ్ రూమ్.. బెడ్‌రూమ్.. పిల్లల బెడ్‌రూమ్.. గెస్ట్‌రూమ్.. అంటూ ఒక్కో గదిని చూపిస్తూ- ఎస్.ఇ.గారి భార్య చెబు తూంటే- ఆమె ఒళ్లంతా కళ్లు చేసుకుని చూడసా గింది.

‘‘ప్రతి ఆదివారం లేడీస్ అంతా ఇక్కడే రిలాక్స వుతాము'' అంటూ- ఆమె చూపించినవైపు చూసిన పరిమళ ఉలిక్కిపడింది.

ఇంట్లో స్విమ్మింగ్ పూల్.. ఈత కొలనా?

ఇది నిజమా? నిజమేనా?

‘‘నెక్స్ట్‌వీక్ మీరూ వద్దురుగానీ'' అన్నమాటతో ఆశ్చర్యంలోనుంచి ఆమె తేరుకుంది. ఇంటికెలా చేరిందో ఆమెకు తెలియలేదు.

• • •

‘‘ఎస్.ఇ.గారి ఇల్లు.. ఇల్లు కాదు. భూలోక స్వర్గం.

తనుంటున్నది ఇల్లు కాదు. పాడుపడిన కొంప. జనరల్ కంపార్ట్‌మెంట్‌లో లాగా చిందరవంద రగా పడేసిన సామాన్లు.. రేపు ఎప్పుడైనా అవసరం కాకపో తాయా అని భద్రంగా దాచుకున్న పాత దుస్తులు- ఏడాది నుంచి కట్ట లుగా పేర్చి పెట్టుకున్న దినపత్రికలు-

స్నేహితురాలు కూతురి పుట్టినరోజుకి ఖరీదైన బహుమతి కొంటానన్నాను. దానికే ఇంత రాద్ధాంతం చేస్తారా?

అసలు నేను ఆ ఫంక్షనుకు వెళ్లను. నా ఖర్మ ఇంతేనని సరిపెట్టుకుంటాను.''

ముక్కు చీదుతూ భార్య చెప్పేసరికి- సిద్దార్ధ దిగిరాక తప్పలేదు. ఆమె చేతిలో వంద రూపాయల నోట్లు బొత్తి ఉంచి ''నీకు తోచినట్లు చెయ్యి'' అని చెప్పేసి వెళ్లిపోయాడు.

తన పంతం నెగ్గినందుకు సంబరపడుతూ- ఎస్.ఇ.గారింట్లో పుట్టినరోజు సంబరం గురించి ఆలోచించసాగింది పరిమళ.

● ● ●

ఆరోజు సాయంత్రమే కార్యక్రమం. అంతకు ముందే ఉదయం 10 గంటల ప్రాంతంలో- పది పదిహేను వరకూ రంగు రంగుల కార్లు ఎస్.ఇ.గారి ఇంటి ముందు ఆగాయి.

బిల బిలమంటూ జనాలు- వాళ్ల చేతుల్లో ఫైల్లు- ''ఈ వీధిలోకి ఒక్క వాహనం కూడా రాకుండా చూడండి'' జీపులో దిగిన పోలీసు అధికారి తన సిబ్బందిని ఆదేశించాడు.

పోలీసులు ఆ దారిని తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. అక్కడున్న కార్లే అటు ఇటూ వెళుతున్నాయి, వస్తున్నాయి.

ఏం జరుగుతోందో? ఎవరికీ అర్ధంకాలేదు. ఆనోటా ఈనోటా- విషయం పరిమళ చెవిన పడింది.

''ఏమండీ! ఆ ఎస్.ఇ.గారి దర్పం చూశారా? ఎన్నెన్ని కార్లు వచ్చి వెళుతున్నాయో!''

భర్త చదువుతున్న పేపరు లాక్కుని మరీ చెప్పింది పరిమళ.

ఆ విషయంపట్ల అంతగా ఆసక్తిలేని సిద్దార్ధ- అది విని కూడా విననట్లు నటించాడు. భర్త నుంచి ఆశించిన స్పందన లేకపోవటంతో ఆమె చెప్పటం మానేసింది. అయితే ఎస్.ఇ.గారింట్లో ఏం జరుగుతోందా అన్న కుతూహలం మాత్రం ఆమెను వదలలేదు.

రాత్రి ఏడెనిమిది గంటల వరకూ- ఒక్క పురుగుని కూడా ఎస్.ఇ. గారింట్లోకి వెళ్లనివ్వలేదు. ''ఈయన భార్య ఏమైంది? బయటకు రాదేం?'' సమయం గడుస్తున్నకొద్దీ పరిమళలో టెన్షన్ పెరిగిపోతోంది-

ఆరొందలు పోసి కొన్న గిఫ్ట్ టేబుల్‌మీద కనిపిస్తోంది. ఎప్పుడెప్పుడు ఆ ఇంట్లోకి వెళదామా అని మనసు పీకుతోంది. కలెక్టర్‌గారి భార్యతో మాట్లాడాలని ప్రయత్నించింది. ఫోనూ సహకరించలేదు.

చికాకు పడుతూ టి.వి. ఆన్ చేసింది.

''ఈరోజు ఉదయం ఆదాయపన్ను అధికారులు ఎస్.ఇ. ఇంటిని సోదా చేసినప్పుడు పెద్ద మొత్తంలో నగదు లభించింది. లక్షలాది రూపాయల పత్రాలు, అనధికార డాక్యుమెంట్లు, బినామీ పేర్లతో ఆస్తులు లభ్యమయ్యాయి. విజిలెన్స్ అవినీతి నిరోధక శాఖ, ఆదాయపన్నుశాఖ అధికారులు సంయుక్తంగా- ఒకే సమయంలో, ఆయన బంధువుల ఇళ్లపై దాడిచేశారు. బ్యాంకు లాకర్లను తనిఖీ చేశారు.

తన కుమార్తె పుట్టినరోజుని పురస్కరించుకుని పెద్దమొత్తంలో సొమ్మును అక్రమంగా వసూలుచేసిన విషయం కూడా తెలిసింది...''

టి.వి.లో వార్తలు వస్తుంటే తెరమీద ఎస్.ఇ.గారు, ఆయన భార్య దిగాలుగా ఉన్న దృశ్యాన్ని చూపారు.

''ఇదంతా ప్రత్యర్థులు పన్నిన కుట్ర. నాకు నెలకి పదివేల రూపాయల జీతం. అంతా కష్టపడి సంపాదించిందే తప్ప ఒక్క పైసా కూడా అక్రమార్జన లేదు...''

ఎస్.ఇ.గారు చెబుతున్నారు. ఆయన మాటల్ని మధ్యలోనే కట్‌చేస్తూ- ''ఎస్.ఇ.గారి అవినీతిలో మరో ఇద్దరు ప్రభుత్వ అధికారులకు కూడా భాగస్వామ్యం ఉన్నట్లు కనుగొన్నారు. దీనిపై శాఖాపరమైన విచారణ చేయవలసిందిగా సిఫార్సు చేస్తున్నాము.

అలాగే ఎస్.ఇ. కుటుంబంతో సన్నిహితంగా మెలిగేవారి గురించి ఆరా తీస్తున్నాము. వీరందరినీ ప్రశ్నిస్తే తప్ప పూర్తి విషయాలు వెలుగులోకి రావు.''

ఎవరో అధికారి చెబుతున్నారు.

ఊపిరి బిగపట్టి- తదేకంగా టి.వి. చూస్తున్న పరిమళ గుండెల్లో రాయిపడింది.

అంటే రేపెప్పుడో తనని కూడ-

అధికారులు కోర్టు బోనెక్కించి-

ప్రశ్నలతో వేధించి-

''మైగాడ్!''- భయంతో ఆమె శరీరం వణికింది.

ఎదురుగా టేబుల్ మీద కనిపిస్తున్న గిఫ్ట్‌ని చూస్తుంటే వణుకు పుట్టుకొస్తోంది. ఆలోచనలు ఎస్.ఇ.గారి భార్య మీదకు మళ్లాయి ఎప్పటిలానే. అయితే- 'ఆవిడెంత అదృష్టవంతురాలో' అనుకోలేకపోయింది ఆక్షణాన.

★

## లోకజ్ఞానం



''ఇప్పుడు పక్కింటి మొగుడు పెళ్లాలు పోట్లాడుకోబోతున్నారు'' అంది పార్వతి.

''అరె! నీకెలా తెలిసింది?'' ఆశ్చర్యంగా అన్నాడామె భర్త.

''మరీ అంత లోకజ్ఞానం లేకపోతే ఎలాగండీ? వాళ్ల టీవీ వాల్యూమ్ సడెన్‌గా పెరిగింది గమనించలేదా?''

## అర్థమయ్యింది!

''పెళ్లికాక ముందు ఎలా ప్రేమించానో ఇప్పుడు కూడా నా భార్యని నేనలాగే ప్రేమిస్తున్నాను. దీన్ని బట్టి నీకేమర్థమయ్యిందీ?'' స్నేహితుడ్ని అడిగాడు సూర్యం.

దానికా స్నేహితుడు టక్కున ఇలా అన్నాడు.

''నువ్వొక కోతలరాయుడివని అర్థమైంది!''

## పేరు

''దీనికి 'రమ్' అనే పేరు ఎలా వచ్చిందో?'' బార్‌లో ఒక తాగుబోతు మరో తాగుబోతుని అడిగాడు.

దానికా రెండో తాగుబోతు టక్కున ఇలా బదులిచ్చాడు.

''రమ్మి...నన్ను ప్రేమించుము అని మనల్ని పిలుస్తుంటుంది కాబట్టి.''

## లేకపోతే ఏంటి?

''నువ్వా వ్యక్తిని ఎందుకలా చితకబాదేవ్?'' అడిగాడు జడ్జి.

''లేకపోతే ఏంటి? ఇదే లాస్టంటున్నా కూడా తప్పించుకుని పారిపోవడానికి ప్రయత్నించాడు మరి'' కోపంగా చెప్పాడు కవి క్రూరశ్రీ.

-సుజీవన (వారాసిగూడ)

